క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


మద్దిపడగలో కరపత్రాలతో నాయకులు

కడెం: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దిపడగ, లక్ష్మీసాగర్, లింగాపూర్ గ్రామాల్లో చెవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భూషణం, చాంద్‌పాషా, భూమన్న, రాజన్న తదితరులు ఉన్నారు.

మట్టి గణనాథులనే పూజిద్దాం

నిర్మల్‌రూరల్: మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలనే పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కోర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వంద మంది విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారు చేశారు. ప్రధానోపాధ్యాయుడు మొహీనుద్దీన్, ఉపాధ్యాయులు రాజన్న, మునీందర్ రాజు, రామారావు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బాజీరావు



భైంసా: ఓబీసీ మోర్చా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భైంసా మండలం బడ్గాం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బాజీరావును ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.భాస్కర్‌రాజ్.. బాజీరావుకు నియామక పత్రం అందించారు. ముథోల్ నియోజకవర్గంలో ఈయన పలు సేవా కార్యక్రమాలు, యువజన సదస్సులు చేపట్టారు. పార్టీ శ్రేణులు అభినందించారు.

చంద్రయాన్–3 సంబురాలు


ఇస్రో అక్షరాల క్రమంలో విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం చంద్రయాన్–3 విజయంపై సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ ఇస్రో ఆంగ్ల అక్షరాల క్రమంలో కూర్చొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్‌వర్మ, ఉపాధ్యాయులు అరవింద్‌కుమార్, భూషణ్, గోపాల్‌రెడ్డి, సంతోశ్, సుధారాణి, సాయినాథ్‌రెడ్డి, లింబవ్వ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోర్డుల విరాళం

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం భైంసాకు చెందిన కొత్తిమీర రమేశ్ ఐదు మార్కర్ బోర్డులను విరాళంగా అందించారు. అదే పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించే రమేశ్ బోర్డుల్లేకపోవడంతో తనవంతుగా రూ.10వేలు ఖర్చు చేసి ఐదు బోర్డులను అందించారు. రమేశ్‌ను తోటి ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

'గృహలక్ష్మి' సర్వే

భైంసా: లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ముథోల్ మండలంలోని సరస్వతీనగర్‌లో సోమవారం గృహలక్ష్మి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేశ్‌బాబు దరఖాస్తులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

సాఠే బాటలో నడవాలి

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ అన్నాభావు సాఠే చూపిన బాటలో నడవాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండలంలోని నగర్ గ్రామంలో సాఠే విగ్రహం ఆవిష్కరించి.. ఆయన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాఠే కమిటీ తాలూక అధ్యక్షుడు ఉత్తం బాలేరావు, రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, శ్యాంసుందర్, ప్రశాంత్, ఆంజనేయులు, గంగాధర్ ఉన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని 2000 సంవత్సరంలో చలో అసెంబ్లీ కార్యక్రమంలో పోలీసు తూటాలకు బలైన అమరులను స్మరించుకుంటూ సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ముగ్గురి ప్రాణత్యాగంతోనే విద్యుత్ చార్జీలను ఇష్టారీతిన పెంచడం లేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, డి.పొశెట్టి, అరవింద్, నవీన్ పాల్గొన్నారు.

సొంత భవనం లేక కష్టాలు

- తానూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం కరువు
- పనులు ప్రారంభించకపోవడంతో వెనక్కి మళ్లిన నిధులు
- ఇరుకుగదుల్లో తరగతుల నిర్వహణ
- సౌకర్యాల్లేక గోసపడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


బీసీ వసతిగృహం పాత భవనంలో కొనసాగుతున్న జూనియర్ కళాశాల


నీటి వసతి లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు

తానూరు: ప్రత్యేక రాష్ట్రంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సౌకర్యాలు కల్పించి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకులు చెప్పిన మాటలు క్షేత్రస్థాయిలో నీటిమూటలుగానే మిగులుతున్నాయి. తానూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు గోసపడుతున్నారు. ఏటా కళాశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం పెరుగుతున్నా.. సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఫర్నిచర్, ప్రయోగశాలలు లేవు, మరుగుదొడ్లకు నీటి వసతి లేదు. సొంత భవనం నిర్మించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

ఎనిమిదేళ్ల కిందట తరగతులు ప్రారంభం..

పదేళ్ల కిందట తానూరు మండల కేంద్రంలో నిర్వహించిన రచ్చబండలో పాల్గొనేందుకు వచ్చిన ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి.. స్థానిక ప్రజల విన్నపం మేరకు తానూరుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేశారు. దీంతో ఎనిమిదేళ్ల కిందట మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సులను ప్రవేశపెట్టారు. 2014–15 విద్యాసంవత్సరంలో 27 మందితో ప్రారంభమైన కళాశాలలో ప్రస్తుతం 200 మంది విద్యార్థులకు పైగా చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో నాలుగేళ్ల కిందట మండలకేంద్రంలోని బీసీ పాత వసతి గృహానికి కళాశాలను మార్చారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు ...

2014–15 విద్యాసంవత్సరంలో జూలై 14న 27 మంది విద్యార్థులతో జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. మొదటి ఏడాది ఇంటర్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2015–16లో 45 మంది విద్యార్థులతో 85 శాతం, 2017–18లో 130 మంది విద్యార్థులుండగా 90 శాతం, 2018–19లో 160 మంది విద్యార్థులతో 90 శాతం, 2020–21లో 200 మంది100 శాతం, 2021–22లో 100శాతం మంది విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు.

సమస్యలివీ..

తానూరులో పాత బీసీ వసతిగృహంలో జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. 200 మందికి మూడు గదులు మాత్రమే కేటాయించడంతో విద్యార్థులు ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలో ప్రయోగశాల, ఫర్నిచర్ వంటి సౌకర్యాల్లేవు. మరుగుదొడ్లకు సైతం నీటి సౌకర్యం లేదు. దీంతో ఒంటికి, రెంటి కోసం విద్యార్థులు సమీపంలోని ఇళ్లకు వెళ్తున్నారు.

ఆరేళ్ల కిందట నిధులు మంజూరు..

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం ఆరేళ్ల కిందట రూ.1.20(కోటి ఇరవై లక్షలు)కోట్ల నిధులు మంజూరు చేసింది. అధికారులు పనులు చేపట్టకపోవడంతో నిధులు తిరిగి వెనక్కి వెళ్లిపోయాయి.

ఇరుకుగదుల్లో తరగతులు



కళాశాలకు సొంత భవనం లేక ఇరుకు గదుల్లో తరగతులు బోధిస్తున్నారు. ఫర్నీచర్, ప్రయోగశాల లేకపోవడంతో పాఠాలు సరిగా అర్థం కావడం లేదు. అధికారులు సొంత భవనం నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– జ్యోతి, విద్యార్థిని

మరుగుదొడ్లలో నీళ్లు రావు



ప్రస్తుతం కళాశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని బాగున్నా.. వాటిలో నీళ్లు రావు. దీంతో మేమంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలి.

– శైలజ,విద్యార్థిని

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

తానూరు జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైన మాట వాస్తవమే. గ్రామపంచాయతీ నుంచి ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంలో జాప్యం కావడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు తమ దృష్టిలో ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చూస్తాం.

– జాదవ్ పరుశురాం, డీఐఈవో

పరామర్శ.. ఆర్థికసాయం

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామంలో పలువురు మృతి చెందగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.రెండు వేల చొప్పున సాయం అందించారు. నంద రాజేందర్ మాతృమూర్తి, బొంత చిన్నభీమన్న, కల్యాణ్, కొలుపుల లింగన్న, దుర్గం భీమన్న కుటుంబాలను పరామర్శించారు. చిన్నం రవి, నిమ్యానాయక్, గుమ్ముల లింగన్న, షాకిర్, రాజరెడ్డి, శ్రీను, అజయ్ తదితరులున్నారు.

జాన్సన్‌నాయక్‌ను కలిసిన నాయకులు

కడెం: బీఆర్ఎస్ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్‌ను సోమవారం ఆయన నివాసంలో మండలంలోని పాత కొండుకూర్ గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలు చర్చించారు. ఇందులో ఉపసర్పంచ్ మామిడిపెల్లి భీమేశ్, మంత్రి రాజేశ్, నితిన్, రత్నాల రాజేశ్, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు


సీఐ మోహన్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఖానాపూర్: పట్టణంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం బ్రహ్మకుమారీలు ముందస్తు రాఖీ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరిమల్ బౌమిక్‌తో పాటు సీఐ మోహన్, ఎస్సై శంకర్, మున్సిపల్ చైర్మన్ రాజేందర్ తదితరులకు రాఖీలు కట్టారు. పవిత్ర ప్రపంచ స్థాపనకు మనలోని అపవిత్ర సంస్కారం తొలగించుకుంటానని చెప్పడమే రాఖీ పండుగ ఉద్దేశమని బ్రహ్మకుమారి సంతోషి అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రాధిక, శ్రీనివాస్, రత్నాకర్ తదితరులున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం


దిలావర్‌పూర్ : పాపహరేశ్వరాలయంలో భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి, సోమవారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవి చెంత మహిళలు కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సారంగాపూర్, కుంటాల, లోకేశ్వరం, నిర్మల్‌తోపాటు మహారాష్ట్ర నుంచి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర, ఓలా శివాలయం, కుంటాల మహాదేవుని, ఉమామహేశ్వర ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. శివలింగాలకు బిల్వార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. సూర్యాపూర్ రాజ రాజేశ్వరాలయంలో నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌కు చెందిన భాగ్యలక్ష్మి–శంకర్, కుంటాల ఉమామహేశ్వర ఆలయంలో జుట్టు లక్ష్మి–వెంకటేశ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానంచేశారు.

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలో ఉన్న మహాదేవుడి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బెంబర, బోరిగాం, తానూరు, ఎల్వి, హిప్నెల్లికి చెందిన భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ధర్మబద్ధంగా జీవనం సాగించాలి


కుభీర్‌లో మాట్లాడుతున్న స్వామీజీ

కుభీర్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనిస్తూ.. ధర్మబద్ధంగా జీవనం సాగించాలని విజయవాడ హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ అన్నారు. వారు చేపట్టిన రథయాత్ర సోమవారం మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వధర్మం వదిలి పరధర్మం స్వీకరించడం మహా పాపమన్నారు. రాబోయే తరాలకు మన సంప్రదాయాలు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులకు సేవ చేస్తే దేవుడి సన్నిధికి చేరుకోవచ్చన్నారు. మహిళలు పెళ్లి తర్వాత అత్తమామలకు సేవ చేయాలన్నారు. అభిషేకం అనంతరం భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పఠించారు. సాముహిక భోజనాల అనంతరం రాజురా, పార్డి(బి) గ్రామాల గుండా రథయాత్ర చాత గ్రామం చేరుకుంది. గురుస్వాములు దొంతుల దత్తాత్రి, బొప్ప నాగలింగం, సూది రాజన్న, పుప్పాల పిరాజీ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలోనే అభివృద్ధి

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

కుంటాల: ప్రత్యేక రాష్ట్రంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్ తండాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రామారావ్ మహారాజ్ స్థిర విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుడు భగవాన్ జోషి ఆధ్వర్యంలో శిఖర ప్రతిష్టాపన, జలాభిషేకం, పాలాభిషేకం, విగ్రహ ప్రతిష్టాపన, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచులు కనీస్ ఫాతిమా, బాపురావు, ఎంపీపీ గజ్జారాం యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, ఎస్సై హన్మాండ్లు, వైద్యుడు రమేశ్, మంత్రి పీఏ శ్రీనివాస్, దత్తు, యువరాజ్, వసంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ప్రత్యేక ఉద్యోగుల నియామకం కోసం తమ పరిధిలోని అన్ని శాఖలకు రోస్టర్ విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ దివ్యాంగుల పునరవాస అభివృద్ధి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న మాట్లాడుతూ ప్రత్యేక ఉద్యోగుల నియామకం కోసం జిల్లా సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అందులో దివ్యాంగుల సంఘము నుంచి ఒకరిని, స్వచ్ఛంద సంస్థల నుండి మరొకరిని నియమించాలన్నారు.

విజ్ఞానమేళాతో మేధాశక్తి

భైంసాటౌన్: విజ్ఞాన మేళాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని ఎంఈవో సుభాశ్ అన్నారు. ఇటీవల తానూరు మండలం భోసిలో జరిగిన విజ్ఞానమేళాలో భైంసా గుజిరిగల్లి శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానాచార్యులు గంగాధర్, ఆచార్యులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురు బీజేపీలో చేరారు. సోన్ మండల కేంద్రం, మామడ మండలం కిషన్‌రావ్‌పేట్, దిలవార్‌పూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు బీజేపీలో చేరగా మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, భూపతిరెడ్డి, వీరేశ్, శైలేశ్వర్, బాపు రెడ్డి, నరేశ్, హైమద్, మక్కన్న, నర్సయ్య, సంతు, అమత్, పోశెట్టి, కంతి రవి, రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న భైంసారూరల్ సీఐ నైలు

భైంసారూరల్: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. సోమవారం మండలంలోని మాంజ్రి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమస్య ఎదురైతే.. ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని సూచించారు. నేరాలు జరగకుండా వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని.. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు సరిగా లేని 98 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, హన్మండ్లు, పోలీసులు, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


నర్సాగౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో సోమవారం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్‌కు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నర్సాపూర్, రాంపూర్, దర్యాపూర్, బీరవెల్లి గ్రామాల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అప్పాల గణేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, అల్లోల మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అల్లోల గౌతమ్ రెడ్డి, రాంచందర్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు..

జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని సోమవారం కలిశారు. బీఆర్ఎస్ టికెట్ వచ్చినందుకు మంత్రిని సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో ఐకేరెడ్డికి మద్దతు ఇస్తామని తెలిపారు. ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అవకాశం ఇస్తే పోటీలో ఉంటా'

భైంసాటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐలకు ఇచ్చిన పిలుపు మేరకు తాను వచ్చానని.. అవకాశం ఇస్తే ముథోల్ నియోజకవర్గంలో పోటీలో ఉంటానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం భైంసాలో ఆయన మాట్లాడుతూ బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థుల సమస్యలు, గుండేగాం పునరావాసం, విద్య, వైద్య సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. తాను గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉంటానని ఆయన పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి'


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రజలను కోరారు. వస్తున్నా మీకోసంలో భాగంగా సోమవారం మండలంలోని రాచాపూర్‌లో ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. నిర్మల్‌లో కబ్జాల మంత్రి, ఇతర ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, పోశెట్టి, హరీశ్, రాజు, గంగాధర్‌గౌడ్, నారాయణ తదితరులు ఉన్నారు.

సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి దేవేందర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వైద్య విధానపరిషత్ పరిధిలో పనిచేస్తున్న పేషంట్ కేర్ శానిటేషన్ కింద విధులు నిర్వహిస్తున్న కార్మికులకు డీఎంఈ సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జింక లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆసుపత్రిలో సోమవారం సమావేశం నిర్వహించారు. దేవేందర్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, భైంసా ఏరియా ఆసుపత్రి, నర్సాపూర్, ఖానాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల కాంట్రాక్టును కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీ దక్కించుకుందని వివరించారు. సదరు ఏజెన్సీ కార్మికులను మోసం చేస్తూ ప్రతి నెలా కార్మికులకు జీవో 60 ప్రకారం రూ.15,600 జీతం చెల్లించాల్సి ఉండగా రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. సర్క్యులర్ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. అనంతరం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. లింగమ్మ, ఏ.పుష్ప, డి.పద్మ, ఆర్.పోతన్న, శాంత, రాజేశ్వర్, భీమన్న, నర్సు, రాజు, శారద పాల్గొన్నారు.

నేడు పూజలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని దేవరకోటలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి దీపారాధన, రంగవల్లుల అలంకరణ, భజనలు ఉంటాయిన పేర్కొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని డీపీఎం(జిల్లా ప్రాజెక్టు అధికారి) వెంకట సాయిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం నిర్వహించిన మండల సమైక్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం సరిత మాట్లాడుతూ మహిళలు ఉపాధి పొందేందుకు ప్రతి గ్రామంలో ఒక్కో యూనిట్ ఏర్పాటు చేసి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం అశోక్, డీఎంజీ పోశెట్టి, సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

సోయాలో తెగుళ్లు పరిశీలన

కుంటాల: మండల కేంద్రంలో సోమవారం తెగుళ్లు సోకిన సోయా పంటను ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో మహేశ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు తెగుళ్ల నివారణకు క్లోరిపైరిఫాస్ 2మి.లీను లీటరు నీటిలో కలిపి, థయోమిథాక్సిమ్ 2మి.లీను లీటరు నీటితో పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ఎల్లో మొసాయిక్ వైరస్ నివారణకు 1.5 గ్రాముల అక్టమిప్రైడ్‌ను లీటరు నీటితో లేదా ఐపీకొనజోల్ 1.5గ్రాములను లీటరు నీటితో పంటపై పిచికారీ చేయాలని అధికారులు సూచించారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

భైంసారూరల్: ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జుట్టు గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో ఎస్టీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సమావేశంలో మాట్లాడారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ కమిటీని నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘంనాయకులు లక్ష్మణ్, సిరాజుద్దీన్, బాజిరెడ్డి, భైంసా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్సికర్ శ్రీనివాస్, ఫిప్పర శ్రీనివాస్, వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.